క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు తగిన సూచనలు సలహాలు అందించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం మంకిడి రాజశేఖర్, పోదెం కృష్ణ ప్రసాద్, కోటయ్య ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



ఏటూరునాగారం : న్యాయ చట్టాలు, కేసులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థులకు లీగల్ విషయాలు తెలిసి ఉండాలని స్థానిక అడ్వకేట్ వైద్యులు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు లీగల్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సును ప్రిన్సిపాల్ రేణుక ప్రారంభించగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏ తప్పు చేస్తే ఎలాంటి కేసు అవుతుంది... మనకు జరిగిన అన్యాయాన్ని ఏ సెక్షన్, చట్టం ద్వారా పరిష్కరించుకోవచ్చు అనే ఆలోచనలు విద్యార్థులకు రావాలన్నారు. అనంతరం కళాశాల అధ్యాపక బృందం వెంకటేశ్వర్లను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటయ్య, జ్యోతి, ఫాతీమా, రమేష్, జీవవేణి, సంపత్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా సుబ్బరామ శర్మ



మంగపేట: మండల ట్రాన్స్‌కో ఏఈగా సుబ్బరామ శర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఏఈ ప్రశాంత్ రెడ్డి ఇటీవల సస్పెండ్ కాగా ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ ఏఈగా కృష్ణారావు విధులు నిర్వహిస్తున్నారు. కాగా నూతన ఏఈగా సుబ్బరామ శర్మను నియమిస్తూ ఆసంస్థ ఉత్తర్వులు జారీ చేయగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ పూలబొకేను అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ వెంకటేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ దురిశెట్టి మధు, మేడిశెట్టి వెంకటరమణయ్య, చారీ, లైన్‌మెన్ పసుపులేటి రవి, అసిస్టెంట్ లైన్‌మెన్ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



వాజేడు: అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వెంకటేశ్వర్లు కుటుంబాన్ని బుధవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్ల కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు దహన సంస్కారాల నిమిత్తం రూ.5 వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు సూర్యం, సాంబమూర్తి, నిజాముద్దీన్, తిరుపతి, రాజు, సుధాకర్, ప్రకాష్ ఉన్నారు.

క్షుద్ర పూజల కలకలం



వాజేడు: మండల పరిధిలోని పాయబాటలు గ్రామ సమీపంలో క్షుద్ర పూజలు జరిగినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాయబాటలు గ్రామానికి సుమారుగా 50 మీటర్ల దూరంలో క్షుద్ర పూజలు చేసినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. పసుపు, కుంకుమ, పేపరు, కొత్త బట్టలు తదితర వస్తువులు ఉన్నాయి. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. క్షుద్ర పూజలను చేస్తే ఎందుకు చేశారు? ఎవరు చేశారు? అనే సందేహాలు గ్రామస్తులను పట్టి పీడిస్తున్నాయి.

అధ్వానంగా రాంనగర్ రోడ్డు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రెండు గ్రామాల ప్రజలు



అసంపూర్తిగా ఉన్న రాంనగర్‌రోడ్డు

ఏటూరునాగారం : కోట్లాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ రోడ్డు మాత్రం బాగు పడలేదు. కాంట్రాక్టర నిర్లక్ష్యం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల పట్టింపులేని తనం వల్ల రోడ్డు అధ్వానంగా మారింది. ఏటూరునాగారం మండలం రాంనగర్-రామన్నగూడెం గ్రామాల మధ్యలోని జీడివాగుపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా గైడింగ్ వాల్ నిర్మాణానికి 2022లో స్పెషల్ నిధుల ద్వారా అప్పటి మాజీ సీఎం కేసీఆర్ రూ. 6 కోట్లు మంజూరు చేయించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారు. దానిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం చూపుతో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో రాంనగర్, లంబాడీ తండా గ్రామాల ప్రజలు గుంతలు పడిన రోడ్డుపై ప్రయాణం చేయాల్సి వస్తోంది. రెండేళ్లు గడిచినప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా రోడ్డు గోదావరి వరదలకు రోడ్డు కొట్టుకపోకుండా గైడింగ్ వాల్‌ను నిర్మించారు. పూర్తి కాకపోవడంతో మళ్లీ గోదావరి వస్తే కొట్టుకపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.



గుంతలమయంగా రోడ్డు

నరకయాతన పడుతున్నాం..



రోడ్డు సరిగా లేక నరకయాతన పడుతున్నాం. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. అప్పుడు కేసీఆర్ ఈ ప్రాంతానికి వచ్చినప్పటికీ నిధులు మంజూరు చేశారు. కానీ ఇప్పటి వరకు పనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. – గార ఆనంద్, రాంనగర్, రైతు

రోడ్డు నిర్మాణం జరగలేదు



గోదావరి వరద వల్ల బ్రిడ్జికి ఇరువైపుల వేసిన రోడ్డు నిర్మాణం జరగలేదు. గైడింగ్ వాల్ కూడా పూర్తి కాకపోవడంతో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
– నాగేశ్వర్‌రావు, చిరువ్యాపారి, ఏటూరునాగారం

నిధులు రాగానే పనులు చేపడతాం

రాంనగర్-రామన్నగూడెం గ్రామాల మధ్యలోని రోడ్డు రూ. 4 కోట్ల వరకు పనులు పూర్తి చేశారని, బిల్ రాకపోవడంతో మిగతా పనులు పెండింగ్‌లో పెట్టారు. బిల్లు ప్రభుత్వానికి అందించాం. బడ్జెట్ రాగానే వారికి అప్పగించి పనులు చేయిస్తాం.
– నరేష్, డీఈఈ
పంచాయతీరాజ్ ఏటూరునాగారం

గుంతలమయంగా రోడ్డు



రామన్నగూడెం పెట్రోల్‌బంక్ పెచ్చులూడిపోయిన బీటీ రోడ్డు

ఏటూరునాగారం: నాలుగు కాలాల పాటు ఉండాల్సిన బీటీ రోడ్డు పెచ్చులూడి గోతులమయంగా మారింది. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వంతో ప్రజాధనం వృథా అవుతుంది. ప్రజల రాకపోకలకు కోసం ఏటూరునాగారం నుంచి కమలాపురం వరకు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా 12 కిలోమీటర్ల మేరకు బీటీ రోడ్డు, సిమెంట్ రోడ్డు, కల్వర్టులు మంజూరు చేశారు. ఈ పనులను వేసవికాలంలో తారు పనులు చేపట్టి పట్టుమని ఆరు నెలలు కూడా కాకముందే రామన్నగూడెం పెట్రోల్‌బంక్ సమీపంలో 100 నుంచి 120 మీటర్ల పొడవు వరకు రోడ్డు బీటీ ఊడిపోయి గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డును నాణ్యత లేకుండా నిర్మించడంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా అవుతుందని ప్రజలు మండిపడుతున్నారు. నిర్మాణ సమయంలో కంకర లెవలింగ్, తారు వేసే క్రమంలో నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడంతో రోడ్డు కుంగిపోయి గోతులు ఏర్పడాయి. వాహనాల రాకపోకలకు మరింత గోతులు పడే అవకాశం ఉంది. నాణ్యత లేని రోడ్డును నిర్మించిన కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ రోడ్డు రామన్నగూడెం, కమలాపురం, మంగపేట వెళ్లే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈవిషయంపై పంచాయతీరాజ్ శాఖ ఏఈఈ నిహిత్‌ను వివరణ కోరగా పంచాయతీరాజ్‌శాఖలోకి కొత్తగా జాయిన్ అయ్యానని, ఇంకా ఏ రోడ్డు పనులు చూడలేదన్నారు. ఆ రోడ్డును పరిశీలించి మరమ్మతు చేయిస్తామని చెప్పారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెయింగ్ మిషన్‌లో ధాన్యం బస్తాను వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన సన్నాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధరతో పాటు బోనస్ రూ.500లను రైతుల ఖాతాల్లో జమచేస్తారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే తూకం వేయాలన్నారు. అలాగే ట్రాన్స్‌ఫోర్ట్‌లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పటిష్ఠంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

రేగొండ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని చిన్నకోడేపాక, విజ్జయ్యపల్లి, రాజక్కపల్లి, కొత్తపల్లిగోరి, నిజాంపల్లి, సుల్తాన్‌పూర్, వెంకటేశ్వర్లపల్లి, జగ్గయ్యపేట, రేగొండ, రంగయ్యపల్లి, రేపాక, రేపాకపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొత్తపల్లిగోరిలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీసీఓ బాల్యానాయక్, తహసీల్దార్ వీరభ్రం, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేటలో బుధవారం ఎమ్మెల్యే సత్యనారాయణరావు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్త, పాత వర్గ విభేదాలు తారాస్థాయికి చేరాయి. కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ సమయంలో కొబ్బరికాయలు కొట్టే సందర్భంలో ఇరువర్గాల వ్యక్తులకు గొడవ మొదలైంది. ఎమ్మెల్యే వెళ్లిన అనంతరం ఒకరినొకరు తిట్టుకుంటూ దిగడంతో గొడవ వాతావరణం నెలకొంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి వర్గ విభేదాలు రెండు వర్గాలుగా కాంగ్రెస్ వ్యవహరిస్తే భారీగా నష్టం జరుగుతుందన్నారు.

యాంటీ మైక్రోబీఎల్ రెసిస్టెన్స్‌పై అవగాహన



వాజేడు : స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం యాంటీ మైక్రోబీఎల్ రెసిస్టెన్స్‌పై సి బ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా వైద్యాధికారి కొమరం మహేందర్ మాట్లాడుతూ అధిక మోతాదులో యాంటి బయోటిక్స్ వాడటంతో రోగ నిరోధక శక్తి తగ్గిపోయి వ్యాధులకు చేరువవుతాయని అన్నారు. గర్భిణులు యాంటి బయోటిక్స్ తీసుకునే మందు సలహాలను తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో యాంటి బయోటిక్స్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి గ్యానస, సిబ్బంది వెంకటరమణ, కోటి రెడ్డి, ఆశ కార్యకర్తలు శాంత కుమారి, దేవి, లక్ష్మి పాల్గొన్నారు.

‘నారాయణరెడ్డి వ్యాఖ్యలు అవాస్తవం’

కాటారం: బీజేపీ నాయకుడు చల్ల నారాయణరెడ్డి మతిభ్రమించి సోషల్ మీడియాలో అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండల కేంద్రానికి చెందిన సువిద్య పాఠశాల కరస్పాండెంట్ కొట్టె శ్రీశైలం అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పుట్ట మ ధుపై శ్రీధర్‌బాబు, శ్రీనుబాబు హత్యకు కుట్ర చేశారని దాని కోసం సువిద్య స్కూల్‌కు చెందిన బస్సును వాడుకున్నారని, అందులో 40 మందిని ఎక్కించుకున్నామని నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు అసత్యం అన్నారు. తాను ఎప్పుడు తన పాఠశాలకు సంబంధించిన బస్సును నారాయణరెడ్డికి కానీ కాంగ్రెస్ నాయకులకు కానీ, పార్టీ అవసరాలకు కానీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. వ్యక్తిగత కక్షలతో తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నారాయణరెడ్డి అసత్యపు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేకుంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ప్రజాసంక్షేమం కోసం శ్ర మిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు పై నిరాధారణమైన ఆరోపణలు చేస్తే ప్రజలు సహించరని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టేకుమట్ల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ మల్లన్న అన్నారు. బుధవారం ఎస్సై గోగికారి ప్రసాద్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు సెల్ మొబైల్‌కు మెసేజ్‌లను, లింక్‌లు పంపిస్తూ బ్యాంకుల నుంచి కాల్ చేస్తున్నామంటూ ఓటీపీలు చెప్పాలంటూ మాట్లాడుతారని అలాంటి వారిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి ఓటీపీలు చెప్తే మన బ్యాంకు ఖాతా నుంచి నగదును చోరీ చేస్తారని చెప్పారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నగదు కోల్పోతే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. కానిస్టేబుల్ సుమన్, టీజీఎస్పీ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ మణిదీప్

టేకుమట్ల: విద్యుత్ మోటార్ల వద్ద రైతులు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ ఏఈ మణిదీప్ సూచించారు. బుధవారం మండలంలోని పంగిడిపల్లిలో ఆపరేషన్ విజన్-భూపాలపల్లి టేకుమట్ల సెక్షన్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ-పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కెపాసిటర్లపై అవగాహన కల్పించారు. విద్యుత్ మోటార్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవడంతో మోటార్లకు హెచ్చుతగ్గులు లేకుండా అందుతుందని, అంతే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు లోడింగ్ సమస్య తలెత్తకుండా ఉంటుందని అన్నారు. ఆయన వెంట లైన్‌మెన్ రఘు, కిరణ్, రైతులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీరాజయ్య

వెంకటాపురం(కె): కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావల్సిన అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలను అందించారు. రెవెన్యూ సిబ్బంది, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు సత్యనారాయణ, సుధ పాల్గొన్నారు.

ప్రజలకు ఐదు వసతులు కల్పించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

ఏటూరునాగారం : పేద వర్గాల ప్రజలకు ఐదు వసతులను కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ ములుగు జిల్లా నాయకుడు సురేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ జగదీష్‌కు ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, ఇళ్లు, భూమి అందించాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ ప్రజలందరికీ ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించి ప్రాణాలను కాపాడాలన్నారు. ప్రతి గ్రామంలో ఆధునిక హాస్పిటల్ నిర్మించాలని కోరారు. ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలపడేలా చూడాలన్నారు. అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యంతో ఒక ఎకరా వ్యవసాయం భూమిని ఇవ్వాలన్నారు. అర్హులైన వారికి 200ల గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్, కమిటీ సభ్యులు విజయ్, అజయ్,తరుణ్,దీపక్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు రోడ్డు ఏర్పాటు చేయాలి



రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

ములుగు రూరల్: దుబ్బగూడెం నుంచి పంట పొలాలకు వెళ్లే దారికి నిధులు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు గుండెబోయిన రవిగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని గుట్ట మీది మునలయ్య ఆలయాన్ని ప్రచార కార్యదర్శి గుండమీది వెంకటేశ్వర్లులతో కలిసి రవిగౌడ్ రోడ్డును పరి శీలించారు. ములుగు మండలం పెగడపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బగూడెం నుంచి పంట పొలాలకు వెళ్లే దారిగుండా కంకర తేలి కనీసం రైతులు నడవలేని పరిస్థితి ఉందని అన్నారు. రాయినిగూడెం, పెగడపల్లి, సర్వాపూర్, దుబ్బగూడెం గ్రామాల రైతులు పంట పొలాలకు వస్తుంటారని వారు అన్నారు. అయితే ఈ రోడ్డు మొత్తం రెండు కిలోమీటర్లు కంకర తేలి కనీసం నడవలేని పరిస్థితి ఉందన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓ స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

‘ఆరు గ్యారంటీల పేరుతో ఆగం చేసిండ్లు’

పలిమెల : సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, పాలకులవి దొంగ మాటలేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజావంచన దినోత్సవాల్లో భాగంగా బుధవారం పలిమెలలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామంటూ ఇంటింటికి తిరిగి సంతకాలు పెట్టి మరీ ప్రచారం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను ఆగం చేశారన్నారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే వాళ్లను దగా చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు పథకాల అమలులో విఫలమయ్యారన్నారు. ఆనాడు కేవలం అధికారం, పదవుల కోసమే చూశారే తప్ప పేద ప్రజల సంక్షేమంపై ఆలోచన చేయడం లేదన్నారు. తెలంగాణాలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామంటూ మహారాష్ట్రలో ప్రచారం చేస్తున్నారని, ఇక్కడి తరహాలోనే మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం దిగివచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని పుట్ట మధుకర్ డిమాండ్ చేశారు.

లెవీ బియ్యం స్టాక్ యార్డు పరిశీలన



లెవీ ధాన్యం రైస్ మిల్లును పరిశీలిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని రాఘవ మోడ్రన్ రైస్ మిల్లులో ఏర్పాటు చేయనున్న లెవీ బియ్యం స్టాక్ యార్డును బుధవారం సివిల్ సప్లయీ డీఎం రమాపతి, డీసీఎస్ఓ ఫైజల్ హుస్సేన్, డీటీ రామచందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో లెవీ బియ్యం నిల్వ ఉంచేందుకు సరైన గోదాం ఉన్నది లేనిది పరిశీలించారు. లెవీ ధాన్యం మిల్లు పనితీరును పరిశీలించడంతో పాటు రైస్ మిల్లుకు సరైన విద్యుత్ సౌకర్యం ఉన్నది లేనిది పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విలీన మండలాల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): వెంకటాపురం, వాజేడు విలీన మండలాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మండల కార్యదర్శి సాధనపల్లి విజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన తర్వాత విలీనమైన మండలాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు. వెంకటాపురం, వాజేడు మండలాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విలీనం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోగిల శ్రీను, చిట్టెం ఈశ్వరావు, మటి రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల్లో చేరాలి

మొగుళ్లపల్లి : మహిళలందరూ మహిళా సంఘాల్లో చేరండని ఏపీఎం రవివర్మ కోరారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ సంబురాల్లో భాగంగా మహిళలను సంఘాల్లోకి ఆహ్వానిస్తూ మండల కేంద్రంలోని వెలుగు మండల సమైక్య కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి నుంచి వడ్డీ లేని రుణాలు, సీఐఎఫ్ రుణాలు, ప్రమాద బీమా, సదుపాయాలను పొందాలని తెలిపారు.